క్లుప్తంగా

భోజన ప్లేట్ల వితరణ

పెరవలి: విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకానికి ఉపయోగపడేలా పెరవలి ఉన్నత పాఠశాలకు రాజమండ్రి వాసి లెక్కించెట్టి వెంకటసుబ్బారావు 150 స్టీలు ప్లేట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పిప్పిర రవి, నాగిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్ వే వాహనాన్ని ఢీ కొట్టిన లారీ



ఖండవల్లి వద్ద జాతీయ రహదారిపై సేఫ్ వే వాహనాన్ని ఢీకొట్టిన లారీ

పెరవలి: జాతీయ రహదారిపై పెరవలి మండలం ఖండవల్లి వద్ద రోడ్డు మరమ్మతుల కోసం నిలుపదల చేసిన సేఫ్ వే వాహనాన్ని వేగంగా వచ్చిన లారీ శుక్రవారం ఢీకొట్టింది. ఆ సమయంలో రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది పెద్ద ఎత్తున వచ్చిన శబ్దానికి పరుగు పెట్టారు. ఈ ప్రమాదంలో సేఫ్ వే వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో సేఫ్ వాహనానికి 10 మీటర్ల దూరంలో పనులు చేయటంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా బయటపడ్డారు. లారీ డ్రైవర్ వీర్రాజు మాట్లాడుతూ నిద్ర ముంచుకురావటంతో లారీ అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగిందని తెలిపాడు. లారీ ఢీ కొట్టిన వేగానికి సేఫ్ వే వాహనం రహదారి మధ్యలో ఉండే డివైడర్‌పైకి దూసుకుపోయింది.

డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించాలి



పెరవలి వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సీసీల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రామకృష్ణ

పెరవలి: డ్వాక్రా సంఘాల బలోపేతానికి సీసీలు నిరంతరం పనిచేయాలని, డ్వాక్రా సంఘాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏపీఎం బి రామకృష్ణ తెలిపారు. పెరవలి వెలుగు కార్యాలయంలో శుక్రవారం సీసీల సమావేశం నిర్వహించారు. ప్రతి సంఘం ప్రతినెలా సమావేశాలు నిర్వహించేలా సీసీలు బాధ్యత వహించాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణ కలిగి, రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాలకు మళ్లీ రుణాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో 1,739 సంఘాలున్నాయని, వీటిలో సగానికి పైగా సంఘాలకు గతేడాది రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. మార్చిలోనే రూ.13 కోట్ల మేర రుణాలు అందించామన్నారు. రుణాలు తీసుకున్న సంఘాలు ఆర్థికంగా బలపడటానికి వారికి ఇష్టమైన వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీసీలు దుర్గ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



అన్నవరప్పాడు శక్తమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

పెరవలి: ఉగాది సందర్భంగా గ్రామ దేవత శక్తమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం వందలాది మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో వేంచేసియున్న శక్తమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు, వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో అన్నవరప్పాడు, ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం, వడలి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు పూలు, గాజులు పంపిణీ చేసారు.

చిన్నారుల ఫొటోలతో ఆకట్టుకున్న వాల్ డిజైన్



తాళ్లపూడిలోని మాంటిస్సోరీ పాఠశాల వద్ద విద్యార్థుల ఫొటోలతో వాల్ డిజైన్

తాళ్లపూడి: తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్లో ఎల్ కేజీ, యూకేజీ చదువుతున్న చిన్నారుల ఫొటోలతో కూడిన పువ్వులు, ఆకులతో కూడిన లత మాదిరిగా గోడను ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రతి పువ్వులో విద్యార్థి ఫొటోతో వినూత్న రీతిలో తయారు చేయడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. స్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్ మాట్లాడుతూ పిల్లల్లో చదువుపై అభిరుచిని పెంచడానికి సుమారు 136 మంది విద్యార్థుల ఫొటోలతో కేజీ టీచర్స్ ఈ అందమైన వాల్ డిజైన్ తయారు చేసినట్టు తెలిపారు.


లాకులు.. లీకులు

- శిథిలమైన పెరవలి లాకు తలుపులు
- తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- పంట భూములకు అందని సాగు నీరు
- జంబోజెట్ తలుపులు లేకపోవటమే

కారణమంటున్న రైతులు



పాడైపోయిన పాత లాకుల తలుపులు



పెరవలిలో తలుపులు ఎత్తివేసిన లాకులు

పెరవలి: కొత్త లాకు నిర్మించినా నిరుపయోగంగా మారటంతో ఇంకా పాత లాకులపైనే ఆధారపడవలిసిన పరిస్థితి ఏర్పడింది. పెరవలిలో పాత లాకుల తలుపులు శిథిలమవడంతో వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదలివేయటంతో కాలువ ఎగువ భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాకుల వద్ద నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదు. దీనితో ఎగువ ప్రాంత భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఉన్న లాకుల తలుపులు పూర్తిగా శిథిలమవడంతో ఉన్న తలుపులైనా కాపాడుకుందామనే ఉద్దేశ్యంతో అధికారులు తలుపులను పూర్తిగా ఎత్తివేసి ఉంచుతున్నారు. అంతే కాకుండా నీటిని నిల్వ చేసే జంబోజెట్ తలుపులు పూర్తిగా పాడైపోవటంతో వాటి మరమ్మతుల కోసం పూర్తిగా తొలగించడంతో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం వరి సాగులో రైతులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. లాకు తలుపులు సక్రమంగా లేకపోవటం వల్ల నీరు దిగువకు వెళ్లిపోవడంతో రైతులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వంతుల వారీ విధానంలోనూ కాలువ ఎగువ భూములకు సాగు నీటిని సరఫరా చేయడానికి అధికారులు పాట్లు పడుతున్నారు.

పెరవలి లాకుల నీటి నిల్వ సామర్థ్యం

పెరవలి లాకుల పరిధిలోని 34 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ లాకులపై ఉండ్రాజవరం, పెరవలి, ఇరగవరం, తణుకు మండలాల్లోని పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో సగం భూములు లాకుల ఎగువ భాగాన ఉంటే సగం దిగువన ఉన్నాయి. లాకులు ఈ విధంగా ఉంటే నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఎలా ఉంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో నీటి ఎద్దడి వలన దిగువ ప్రాంతంలో రైతులు ఇరిగేషన్ అధికారులపై దండెత్తి పెరవలి లాకుల తలుపులను ఎత్తివేసిన ఘటనలు జరిగాయి. లాకు తలుపులు ఎలా ఉన్నా జంబోజెట్ తలుపులను మరమ్మతులు చేసి కిందికి దించి ఉంచితే లాకు పైభాగం భూములకు నీటి ఎద్దడిని నివారించవచ్చని పలువురు రైతులు అన్నారు. కాలువ ఎగువ భాగంలో ఉన్న పంట భూములకు నేరుగా పైపులతో సాగు నీరు అందించాల్సి ఉంది. కానీ లాకుల వద్ద నీటి నిల్వ సామర్థ్యం లేకపోవటం వలన వాటిగుండా అతి తక్కువలో నీటి ప్రవాహం ఉండటంతో చేలకు నీరు అందటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

లాకుల నిర్వహణలో జంబో తలుపులు ప్రధానం

జంబోజెట్ తలుపులు లాకుల నిర్వహణలో ప్రధాన భూమిక వహిస్తాయి. ప్రతి లాకుకి రెండు తలుపులు లాకు భూగర్భంలో అమరుస్తారు. ఈ తలుపులు ఎప్పుడూ నీటి అడుగుభాగంలోనే ఉంటాయి. ఈ తలుపులను ఎత్తితే కాలువ గర్భం నుంచి నీరు దిగువకు వెళ్లిపోతుంది. దీనితో లాకుల పైభాగంలోని భూములకు సాగునీరు సక్రమంగా అందకపోవడం, లాకుల వద్ద నీటిని నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడం జరుగుతుంది. ఇంత ప్రధానమైన జంబోజెట్ తలుపులు పెరవలి లాకుల వద్ద లేకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ కొత్త లాకు కేవలం పాత లాకు రక్షణకు తప్ప ఎందుకూ ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు.

పంటకు నీరందడం లేదు



లాకుల వద్ద తలుపు పూర్తిగా ఎత్తి ఉంచటం వలన మెరక ప్రాంతంలోని చేలకు నీరు అందటం లేదు. దీనితో చేలు ఎండిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికే వరి సాగుకు వేలల్లో పెట్టుబడి పెట్టాం. పంట ఏమవుతుందోనని ఆందోళనగా ఉంది.

– మల్లుల వీరాస్వామి, రైతు, పెరవలి

నీటిని తోడుకుంటున్నాం



కాలువ ఎగువ భూములకు నీరు అందటంలేదు. లాకుల వద్ద 5 అడుగుల పైగా నీటి మట్టం ఉంటే నేరుగా పైపుల ద్వారా నీరు వస్తుంది. అదిలేకపోవటం వలన ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్నాం.

– కాపకా పాపారావు, రైతు, కాకరపర్రు

జంబోజెట్ తలుపులకు మరమ్మతు



కాకరపర్రు కెనాల్ ద్వారా 1,500 క్యూసెక్కుల నీరు వస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వంతుల వారీగా నీటిని సరఫరా చేస్తున్నాం. పాడైపోయిన జంబోజెట్ తలుపులను తొలగించి మరమ్మతులకు ఇచ్చాం. ఈ తలుపులు లేకపోవడంతో లాకుల వద్ద నీటి మట్టం నిలబడటం లేదు.

– ఎస్.బాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

శాంతి ర్యాలీ



చాగల్లు తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు, విశ్వాసులు

చాగల్లు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మరణంపై న్యాయం చేయాలని చాగల్లు మండల క్రిస్టియన్ జేపీసీ పాస్టర్స్ అసోసియేషన్ కోరింది. శుక్రవారం చాగల్లులో అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అసోసియేషన్ పాస్టర్లు తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు జాలెం వెంకట్రావు, ఉన్నమాటి బ్రహ్మానందం, కందుకూరి శ్యామ్, గద్దం సురేష్, సబ్బితి సుబ్బారావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

బెస్ట్ హ్యాండ్ రైటింగ్ స్టూడెంట్ అను



అనును అభినందిస్తున్న ప్రముఖులు

నల్లజర్ల: యూనివర్సల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన పోటీల్లో దూబచర్ల సంఘమిత్ర స్కూలు 9వ తరగతి విద్యార్థి బోడిగడ్ల అను ప్రథమ స్థానం సాధించినట్టు సంస్థ డైరెక్టర్ సీహెచ్ పవన్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆ స్కూలులో బాలిక అనును ఆయన అభినందించారు. చేతిరాత మెరుగుపర్చుకోవడం ద్వారా పరీక్షలలో మంచి మార్కులు సాధించవచ్చని ఆయనన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆరికిరేవుల గ్రామంలో మట్టా చంద్రశేఖర్ (23) శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులెవరు ఇంట్లో లేని సమయంలో అతడు ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఓ సోదరి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వేగలయ్య తెలిపారు.

ఆస్తి పన్ను రాయితీ నెలాఖరు వరకూ పొడిగింపు

కొవ్వూరు: ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏక మొత్తంలో పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ అందిస్తామని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు.ఏప్రిల్ 30వ తేదీ వరకు ఐదుశాతం రాయితీ అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు పురపాలక సంఘం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుదారులు పురపాలక సంఘం కార్యాలయంలో లేదా వార్డు సచివాలయంలో చెల్లించాలని సూచించారు.

ఘనంగా యర్రంపల్లమ్మ ఉత్సవాలు

గోపాలపురం: గోపాలపురం – గుడ్డిగూడెం రోడ్డులో వెలసిన యర్రంపల్లమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ, తమలపాకుల పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిపోటి గంగారావు, మచ్చా రాంబాబు, కర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి



సంగాయగూడెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అమ్మాజీ

దేవరపల్లి: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై దృష్టి పెట్టాలని కొవ్వూరు డివిజన్ పంచాయతీ అధికారి అమ్మాజీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని బందపురం, దేవరపల్లి, సంగాయగూడెం, రామన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆమె పారిశుధ్య నిర్వహణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 5.30 గంటలకు బందపురం శివారు రంగరాయ కాలనీకి చేరుకున్నారు. ఆ సమయానికి పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులు అక్కడ లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు పక్క చెత్తను తొలగించాలని ఆదేశించారు. అనంతరం దేవరపల్లి, రామన్నపాలెం, సంగాయగూడెం గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. గ్రామాల్లో రోడ్ల పక్కన ఉండే చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అమ్మాజీ అన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ వై.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలు

రూ.32,280 జరిమానా



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్, ట్రాక్టర్లు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం, సంగాయగూడెం గ్రామాల పరిధిలోని పోలవరం కుడి కాలువ గట్టును తవ్వి, మట్టిని అక్రమంగా చేస్తున్న రవాణాపై అధికారులు చర్యలు తీసుకున్నారు. గత నెల 28వ తేదీ రాత్రి యర్నగూడెం, సంగాయగూడెం ప్రాంతంలో రాత్రి సమయంలో పోలవరం కుడి కాలువ గట్టును తవ్వి, ట్రాక్టర్లపై మట్టిని అక్రమంగా రవాణా చేస్తుండగా, కృష్ణంపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు అడ్డుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని, మట్టి తవ్వుతున్న పొక్లెయిన్, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు పోలవరం కుడి కాలువ గట్టును పరిశీలించి, తవ్విన మట్టి పరిమాణాన్ని లెక్కలు కట్టారు. 12 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వినట్టు అధికారులు నిర్ధారించారు. మట్టికి రూ.7,280, పొక్లెయిన్‌కు రూ.25 వేల జరిమానా విధిస్తూ జిల్లా మైనింగ్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొక్లెయిన్, ట్రాక్టర్ల యజమాని ఎ.లోవరాజు జరిమానా చెల్లించి, పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాలను విడిపించుకున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

పంచాయతీ దుకాణాలకు బహిరంగ వేలం



యర్నగూడెంలో పంచాయతీ దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామ పంచాయతీకి చెందిన 30 దుకాణాలకు అధికారులు శుక్రవారం నెలవారీ అద్దెకు బహిరంగ వేలం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొంతా భరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో 90 మంది రూ.9 లక్షల ధరావతు చెల్లించి పాల్గొన్నారు. దుకాణాలను 30 మంది వ్యాపారులు దక్కించుకున్నారు. ఈ 30 దుకాణాలకు నెలకు రూ. 1,55,700 ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజు తెలిపారు. 30 నెలల కాల పరిమితికి ఈ వేలం నిర్వహించామన్నారు. మొత్తం షాపుల్లో నాయీబ్రాహ్మణులకు 3, దివ్యాంగులకు 1 కేటాయించామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంప్లెక్స్‌లో 9, డాక్టర్ వైఎస్సార్ కాంప్లెక్స్‌లో 9, నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌లో 12 దుకాణాలకు వేలం నిర్వహించామని వివరించారు. ఈ షాపుల ద్వారా పంచాయతీకి గతంలో నెలకు రూ.20 వేల ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ప్రతి నెలా అదనంగా రూ.1,25,700 పెరిగిందని తెలిపారు. వైఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఒకటో దుకాణాన్ని తాడి కనకదుర్గారెడ్డి అత్యధికంగా రూ.25 వేలకు పాడుకున్నారన్నారు. పాటదారులు ప్రతి నెలా పంచాయతీకి సక్రమంగా అద్దె చెల్లించాలని కోరారు.

డైట్ కళాశాలలో పోస్టుల భర్తీకి చర్యలు

నల్లజర్ల: జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (దూబచర్ల డైట్ కళాశాల)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 6 సీనియర్ అధ్యాపకులు, 17 మంది అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డైట్ ప్రిన్సిపాల్ యం.కమలకుమారి తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని, 16, 17తేదీల్లో రాత పరీక్ష ఉంటుందని, 19న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అభ్యర్థి వయస్సు 31 మార్చి 2025 నాటికి 58 సంవత్సరాలు మించరాదు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం, ఎంఈడీలో 55 మార్కులు పొంది ఉండాలన్నారు. సీనియర్ లెక్చరర్స్ పోస్టులకు మండలవిద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అర్హులన్నారు. స్కూల్ అసిస్టెంట్లు అధ్యాపకుల పోస్టులకు అర్హులన్నారు. పూర్తి నోటిఫికేషన్ జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు వారి వెబ్‌సైట్‌లో పొందిపర్చినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు సీనియర్ లెక్చరర్ యస్.ఆర్.సుబ్రహ్మణ్యం, 94901 86986 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.దరఖాస్తును గూగుల్ ఫాంలో మాత్రమే సమర్పించాలన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

నల్లజర్ల: ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి కమల్‌రాజ్ మాట్లాడుతూ మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 10 వేల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. 73373 59375కు హాయ్ అని మెసేజ్ చేస్తే ధాన్యం షెడ్యూలింగ్ సమాచారం తెలుస్తుందన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రత్యేక చర్యలు

ఉండ్రాజవరం: రబీలో ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం సేకరణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లర్లు, సొసైటీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, అగ్రికల్చర్ అసిసెంట్లు, వీఆర్వోలకు సీఎస్‌డీటీ సుధీర్ రెడ్డితో కలసి ఆయన అవగాహన కల్పించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. రైతులు పండించిన ధాన్యం, ప్రతి గింజ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలి



నిడదవోలు గణపతి సెంటర్‌లో మానవహారం నిర్వహించిన ముస్లింలు

నిడదవోలు : ఇటీవల కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముస్లిం వక్ఫ్ బోర్డులోని వివిధ అంశాలను సవరిస్తూ తీసుకువచ్చిన ఉమీద్ యాక్ట్ రద్దు చేయాలని కోరుతూ ముస్లిం ఐక్యవేదిక కన్వీనర్ ముహమ్మద్ నౌషాద్ ఆధ్వర్యంలో పట్టణంలో షాదిఖానాలో శుక్రవారం నిరసన సభ నిర్వహించారు. ఈ సభలో వివిధ మసీదు మత పెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఈ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులోని అంశాలు ముస్లిం మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన వివిధ రాయితీలు, ప్రత్యేక హక్కులను హరించే విధంగా ఉన్న కారణంగా తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లుగా ప్రకటించారు. అనంతరం మస్జిద్‌ల ముతవల్లిల ఆధ్వర్యంలో గణపతి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా స్థానిక తహసీల్దారు కార్యాలయ వద్దకు చేరకుని ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య వేదిక నాయకులు ఎస్‌కే వజీరుద్దీన్, షరీఫ్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు (ఉమీద్) దేశంలో దశాబ్దాలుగా ఉన్న లౌకికవాదానికి భంగకరమన్నారు. హిందూ దేవాలయ బోర్డుల్లోకి సభ్యులుగా అన్య మతస్తులకు లేని అవకాశం ముస్లిం వక్ఫ్ బోర్డుల్లో కల్పించటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ముస్లింలకు దక్కాల్సిన దాతల భూములు, ప్రార్థనా స్థలాలను కబ్జా చేసేందుకే ఈ చట్టం ఉపకరిస్తుందన్నారు. తక్షణమే ముస్లిం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. జామియా మస్జిద్ ముతవల్లి అబ్దుల్ అజీజ్ భాషా, మర్కజ్ మజీద్ వైస్ ముతవల్లి అబ్దుల్ రవుఫ్ షమీన్, ఖురేషీ మస్జిద్ ముతవల్లి ఫహీం, బస్టాండ్ మస్జిద్ ముతవల్లి ఇమామ్ ముర్తజా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఏఎంసీ చైర్మన్‌గా బ్రహ్మరాజు

దేవరపల్లి/నల్లజర్ల: గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలేనికి చెందిన పంచాయతీ ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు యద్దనపూడి బ్రహ్మరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఏఎంసీ ఏర్పడిన అనంతరం తొలిసారిగా నల్లజర్ల మండలానికి చైర్మన్ పదవి లభించింది.

ఈదురు గాలులు... చిరుజల్లులు

కొవ్వూరు: నియోజకవర్గం వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. రాత్రి 7 గంటల నుంచి ఈదురుగాలులకు తోడు పలుచోట్ల చిరు జల్లులు కురిశాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.దీంతో కొద్ది సేపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.ఉదయం నుంచి ఉష్ణతాపంతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపసమనం లభించింది.

పిచ్చికుక్క స్వైర విహారం

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో 12 మంది గాయాలపాలయ్యారు. రెండు రోజులుగా గ్రామంలో ఎస్సీ, బీసీ ప్రాంత వీధిల్లో పిచ్చికుక్క చిన్నపిల్లలు, పెద్దలపై దాడి చేసి కరిచింది. తీవ్రంగా గాయపడిన వారు నిడదవోలు, బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. పిచ్చికుక్కను పట్టుకునేందుకు పంచాయతీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పిచ్చికుక్క ఏ సమయంలో వచ్చి దాడి చేస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

ఓటర్లకు రేషనలైజేషన్ చేయాలి

గోపాలపురం: 1200 మంది ఓటర్లకు రేషనలైజేషన్ చేయాలని, తద్వారా త్వరితగతిన ఓటర్ల గుర్తింపు నిర్వహించవచ్చని గోపాలపురం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి పి.భాగ్యవతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం మండలంలోని బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బీఎల్ఓ తన పరిధిలో ఉన్న ఓటర్లను ఫారం 6,7,8 ద్వారా గ్రామంలో ఉన్నటువంటి ఓటర్లను, మరణించిన ఓటర్లను త్వరితగతిన గుర్తించాలన్నారు. నూతన ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలు ముందుండాలని సూచించారు. ప్రతి 1200 మంది ఓటర్ల జాబితా తయారు చేసుకోవాన్నారు. తహసీల్దార్ కె.అజయ్‌బాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఎప్పటికప్పుడు ఓటరు జాబితాను సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ కె.సాంబశివరావు, కాట్రు నల్లరాజు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

నిడదవోలు : భద్రాచలంలో ఈనెల 6న నిర్వహించనున్న సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 5వ తేదీ సాయంత్రం భద్రాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతునట్లు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ

పెరవలి: మండలంలో అన్ని కులాల కార్పొరేషన్లకు కలిపి 148 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో కాపులకు 50 యూనిట్లు, బీసీలకు 66, ఎస్సీలకు 22, జనరల్‌కు (రెడ్డి, క్షత్రియ, వైశ్య తదితరులు) 10 యూనిట్లు కేటాయించారు. ఈ రుణాలకు సంబంధించి పెరవలి మండలంలో 815 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం బ్యాంక్ అధికారులు అభ్యర్థులందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొవ్వూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజకవర్గంలో తొమ్మిది మందికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2,01,479 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తదితరులు పాల్గొన్నారు.